నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

మెదక్

శనివారం | 27 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

సీతారామ, ఉమామహేశ్వరుల కళ్యాణానికి గోటి తలంబ్రాలు సిద్ధం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లో జరిగే సీతారామ, ఉమామహేశ్వరుల కళ్యాణం కోసం శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో వేలాది భక్తులు సిద్ధం చేసిన ఓడ్లు ఓలిపించి గోటి తలంబ్రాలను శుక్రవారం శేషసాయి మోక్షమం దిరంలో అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవ స్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు మా ట్లాడుతూ.. భద్రాచల దేవస్థానంలో జరిగిన సీతారాముల కళ్యాణానికి 150కిలోల గోటి తలంబ్రాలను అందించిన చరిత్ర తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రామకోటి సంస్థకు దక్కిందన్నారు. అదే సంకల్పంతో గజ్వేల్‌లో జరిగే సీతారాములకు కూడా గోటి తలంబ్రాలు అందించాలని భక్తుల కోరిక మేరకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ఉప్పల మెట్టయ్య, యెల్లు రాంరెడ్డి, శేషసాయి భక్త బృందం పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలి



నవతెలంగాణ-నంగునూరు

ఉపాధి పనులు చేసే ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రకళ ఆదేశించారు. శుక్రవారం నంగునూరు గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ చట్టం పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో పెట్టాలన్నారు. ఎండ తగలకుండా షేడ్ నెట్‌లు తదితర వసతులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింగరావును ఆదేశించారు.

అందినకాడికి దోచుకున్నారు..
అప్పులు మిగిల్చారు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలోనే కేటీఆర్ జైలుకు.. కేసీఆర్ కూడా పోయే అవకాశం
- దేవాదాయశాఖ, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు



నవతెలంగాణ-సిద్దిపేట

బీఆర్ఎస్ తొమ్మిదిన్నర ఏండ్ల పాలనలో అందిన కాడికి దోచుకున్నారు.. అప్పులు మిగిల్చారు. కాంగ్రెస్‌ను చూస్తే బీఆర్ఎస్‌కు భయం పట్టుకుంది. లిక్కర్ కేసులో కవిత జైల్లో ఉందని, ఫోన్ టాపింగ్ కేసులో త్వరలో కేటీఆర్ జైలుకు వెళ్తాడని, కేసీఆర్ కూడా పోయే అవకాశం ఉంది' అని దేవదాయ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట పట్టణంలో శుక్రవారం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సీఎంగా రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత పాలనలో మార్పులు వచ్చాయన్నారు. వచ్చిన నాలుగు నెలల్లోనే ఐదు గ్యారెంటీలను నెరవేర్చామన్నారు. రైతు రుణ మాఫీ పట్ల హరీశ్‌రావుకు అంత స్పీడు వద్దని, ఆగస్టు 15 వరకు తన రాజీనామా విషయంలో ఆగాలన్నారు. అమిత్ షా సిద్దిపేటకు వచ్చిన సందర్భంలో మైనార్టీల బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేస్తానని చెప్పాడని.. వారు మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తప్పక మారుస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. దేవుడి పేరిట ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. బాల రాముని ప్రతిష్టించి మోడీ రాముని పక్కన సీతను లేకుండా చేశాడని.. ఆయన కూడా బ్రహ్మచారి అన్న విషయాన్ని అందరూ గుర్తెరగాలన్నారు. ఇందిరా గాంధీ మెదక్ లో మెదక్ పోటీ చేస్తే అనేక ఫ్యాక్టరీలను ఇచ్చారని, మోడీ ఒక్క ఫ్యాక్టరీ అన్న ఇచ్చాడా, రఘునందన్ రావుకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ప్రాజెక్టుల పేరుతో పేద ప్రజల భూములను తీసుకొని ప్రభుత్వానికి అందించిన బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి.. కాళ్లు మొక్కి ఎమ్మెల్సీ పదవి తెచ్చుకున్నాడని అన్నారు. బీసీ బిడ్డ మధుకు ఓటు వేసి గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. అంతకుముందు నీలం మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాలకు చెందిన తనకు అవకాశం ఇచ్చిందని, సమానత్వం కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ప్రజలను కోరారు. పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు తీసుకుపోయిన పార్టీ కాంగ్రెస్ పార్టీని అన్నారు. సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ.. వెంకటేశ్వర స్వామిగా ప్రతిజ్ఞ చేసిన తాను హరీశ్‌రావుకు నిద్ర పోనివ్వనని, తాను కూడా నిద్రపోనన్నారు. ఎక్కడినుండి వచ్చాడో అక్కడికే తీసుకెళ్తానన్నారు. ఫార్మాట్ తెలవకుండా రాజీనామా చేస్తాననడం హరీశ్‌రావుకి చెల్లిందన్నారు. మామ, అల్లుళ్లు రాజీనామా చేయండి.. అక్కడ రేవంత్ రెడ్డి, తాను పోటీ చేస్తానని ఎవరు గెలుస్తారో చూద్దామన్నారు. నీలం మధు గెలిస్తే సిద్దిపేట లాగా ఇతర ఆరు నియోజకవర్గాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి, చిట్టి దేవేందర్ రెడ్డి, గూడూరి శ్రీనివాస్, తాడూరి శ్రీనివాస్, బొమ్మల యాదగిరి, గాడి పల్లి శ్రీనివా సరెడ్డి, వహీద్ ఖాన్, ఖలీమొద్దీన్, సూర్య వర్మ, అత్తూ, మీసం నాగరాజు, గుర్రం శ్రీనివాసరెడ్డి, పాండు, రాజు బహదూర్, రియాజుద్దీన్, శ్రీదేవి బుచ్చిరెడ్డి, సాకి బాల లక్ష్మి ఆనంద్, భవాని రెడ్డి, ముద్దం లక్ష్మి, శివప్ప తదితరులు పాల్గొన్నారు.



స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలి

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో అంకిల్లా యాదవ్ రెడ్డి ఏర్పాటు చేసిన రుద్ర టెడర్స్ దుకాణాన్ని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డితో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ అభ్యర్థిగా గెలిచినాక నిరుపేద విద్యార్థులకు అండగా ఉండేందుకు రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కలెక్టర్‌గా కొత్త జీవితం ఇచ్చిన సిద్దిపేట గడ్డపైనే తన రాజకీయ జీవితానికి శ్రీకారం చుట్టానని, తనని ఆశీర్వాదించాలని కోరారు. ఈ గెలుపు యువత భవిష్యత్తుకు కీలకమని అన్నారు. డిగ్రీలు సాధించి ఎంతోమంది విద్యార్థులకు సరైన నైపుణ్యం లేక వారి లక్ష్యాలు నెరవేరడం లేదన్నారు. తాను చనిపోయిన తర్వాత 50 ఏండ్ల వరకు తన పేరు ఉండేలా సేవ చేస్తానని తెలిపారు. తాను విజయం సాధించిన అనంతరం తొమ్మిది నెలల్లో ఏడు నియోజకవర్గాల్లో ఫంక్షన్ హాల్స్ నిర్మించి బీఆర్ఎస్ శ్రేణులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కలెక్టర్ హోదాలో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు సహకారంతో సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా పని చేసి దేశంలోనే మంచి కలెక్టర్‌గా పేరు తెచ్చుకున్నానన్నారు. తన గెలుపునకు యువత కీలక పాత్ర పోషించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ గుండా రంగారెడ్డి, కొండపోచమ్మ మాజీ చైర్మెన్ జంబుల శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు కిరణ్‌గౌడ్, కవిత, రమ్యరవి, కావ్య దర్గయ్య, మండల కో-ఆప్షన్ ఇక్బాల్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ వితరణ

నవతెలంగాణ-సిద్దిపేట

అలయన్స్ క్లబ్, మాతృశ్రీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శుభోదయం పాఠశాల ఆవరణలో పాదచారుల కోసం మజ్జిగను శుక్రవారం క్లబ్ సభ్యులు పంచారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ సిద్దిపేట జిల్లా వీఆర్వో, మాతృశ్రీ క్లబ్ గౌరవ సభ్యులు ఆడారి సుజాత ప్రసాద్, విజయలక్ష్మి, ఆత్మ రాములు, జిల్లా గవర్నర్ చకిలం బాలచంద్రం, ములుగు నిర్మల, స్ఫూర్తి అధ్యక్షులు కొండూరు వెంకటేశం, డైమండ్ క్లబ్ కార్యదర్శి ములుగు కృష్ణమూర్తి, సరాఫ్ సుజాత, లావణ్య, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహ హుండీ ఆదాయం రూ.5,11,971

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీ లెక్కింపు సిద్దిపేట డివిజన్ పరిశీలకులు రంగారావు, సంబంధిత అధికారులు, సిబ్బంది సమక్షంలో నిర్వహించినట్టు ఆలయ ఈఓ విశ్వనాథ శర్మ శుక్రవారం తెలిపారు. అక్టోబర్ 19,2023 నుంచి ఏప్రిల్ 26, 2024 వరకు హుండీ లెక్కింపు చేపట్టగా రూ.5,11,971 లక్షలు ఆదాయం సమకూరిందని.. నగదును యూనియన్ బ్యాంక్‌లో జమచేసినట్టు వెల్లడించారు. పోలీసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తెమెట్టలు అందజేసిన కౌన్సిలర్ దుర్గేష్

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 14 వార్డు కాలనీకి చెందిన దన్నారం పద్మ కుమారుడు కుమార్, జోగ్గిళ్ళ శిరీషల వివాహానికి అవార్డు కౌన్సిలర్ కౌన్సిలర్ పైతర గారి దుర్గేష్ పుస్తె మెట్టలను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడు తూ.. కాలనీలో తనకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందిస్తున్నానన్నారు. వధూవరులకు పెండ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు.



నూతన వధువరులను ఆశీర్వదించిన జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ

నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శమ్మని భాస్కర్ సోదరులు అజయ్ – ప్రియాంక వివాహం ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హల్‌లో శుక్రవారం జరిగింది. ఈ వివాహానికి మర్కుక్ జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి హజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మన్నె అంజనేయులు, నరేష్, మౌర్య సంఘం అధ్యక్షులు పెర్క పరుశురాములు తదితరులున్నారు.

సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి





నవతెలంగాణ-మద్దూరు

నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్ కోరారు. శుక్రవారం దూళ్మిట్ట మండలంలోని తోర్నాల గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో హమాలీ కార్మికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ 29 రకాల కార్మిక చట్టాల ను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. 8 గంటల పని దినం, కనీస వేతన చట్టం, కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు.. లాంటి 29 రకాల చట్టాలను రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ పెట్టుబడుదారీ ప్రయోజనాలను కాపా డటమే కాక, ప్రజాధనాన్ని కొల్లగొట్టి శ్రామిక వర్గం సంపా దించి పెట్టిన దేశ సంపాదన మొత్తాన్ని కారు చౌకగా కార్పొరే ట్ శక్తులకు అప్పనంగా అప్పగించిందని ఆరోపించారు. వీటిని ప్రశ్నించిన వారిపై నిర్బంధాన్ని ప్రయోగించి కుట్రపూ రితమైన కేసులు బనాయిచ్చి జైళ్లలో పెడుతున్నారన్నారు. అంతేకాకుండా, కులం, మతం, భాష పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతుందని విమర్శించారు. ఇలాంటి బీజేపీని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కనకరాజు, యాదగిరి, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల : నిజాయితీతో ప్రజల కోసం పనిచేసే సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండీ జహంగీర్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భువన గిరి పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్న ఇతర పార్టీల అభ్యర్థులు ఎవరూ జహంగీర్‌కు సాటిరారన్నారు. మతసామరస్యానికి కట్టుబడి, భారత రాజ్యాంగంపై నమ్మకం చూపే ప్రతి ఒక్కరూ ఈ పార్లమెంటు ఎన్నికల్లో దేశ భద్రత, రక్షణ కోసం ఆలోచించే పరిస్థితి ఏర్పడిందన్నారు.కార్మికులు, రైతులు, మేధావులు, చిరు వ్యాపారులు, వృత్తిదారులు, మైనార్టీలు, దళితులు, మహిళలు, మధ్యతరగతి ప్రజలంతా ఏకమై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని, సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రేపాక కుమార్, గుండ్ర రవీందర్, ఎజాస్, దానయ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు..



హరీశ్‌రావుకు మద్దతుగా గన్‌పార్క్‌కు తరలిన నాయకులు

నవతెలంగాణ-నంగునూరు

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుకు మద్దతుగా నంగునూరు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు గన్‌పార్క్‌కు శుక్రవారం తరలి వెళ్లారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తూ ఆగస్టు 15న ఆరు గ్యారంటీలను నెరవేర్చి రైతు రుణ మాఫీ చేస్తే రాజీనామా చేస్తా అనే మాటకు కట్టుబడి ఉంటానని పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. రాజీనామాతో గన్ పార్క్ చేరుకున్న హరీశ్ రావుకు మద్దతు పలికారు. నంగునూరు మండలం నుంచి హరీశ్ రావుకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు.. నినాదాలు చేయడంతో అక్కడే ఉన్న పోలీసులు సముదాయించి పంపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడ్ల సోమిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కర్ణకంటి వేణు, గఫూర్, శ్రీకాంత్ యాదవ్, దాసరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జీవోలపై ఉపాధ్యాయులకు అవగాహన ఉండాలి



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వ జీవోలపై అవగాహన కలిగి, చక్కటి బోధన చేయాల్సిన అవసరం ఉపాధ్యాయులపై ఉందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్ అన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా స్థాయి శిక్షణా తరగతులు పీయస్‌డబ్ల్యూఏ భవన్ సిద్దిపేటలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సంబంధించిన జీవోలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ ఎంతో అవసరమని, ఉత్తమ ఉపాధ్యాయులుగా పలు శిక్షణల ద్వారా విద్యా బోధన చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎస్టీయూ 76 సంవత్స రాలుగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. కాగా, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, జిల్లా అధ్యక్షులు పట్నం భూపాల్, ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్, ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, నాయకులు ఏవీ సుధాకర్, పున్నగణేష్, ప్రవీణ్ కుమార్, మట్టపల్లి రంగారావు తదితరులు ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఐత అంజయ్య, ఖాత యాదగిరి, లింగారెడ్డి, లింగ శ్రీనివాస్, ఉండ్రాళ్ళ రాజేశం, మురికి శ్రీనివాస్, రాములు, ఎస్టీయూ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గీతం స్కాలర్ సముద్రాల రాజేంద్రప్రసాద్‌కు పీహెచ్‌డీ



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి సముద్రాల రాజేంద్రప్రసాద్ డాక్టరేట్ అర్హత సాధించారు. 'బేస్-మాడిఫెడ్ న్యూక్లియోసైడ్ డెరివేటివ్స్ యొక్క కీమో/రెజియో-సెలెక్టివ్ సింథసిస్' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. పూర్ణచంద్రరావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పరిశోధన ప్రాథమిక లక్ష్యం అనేక 3'-O-ఎంఈ, ఇతర ఆల్కైల్-ప్రత్యామ్నాయ న్యూక్లియో సైడ్‌లను సంశ్లేషణ చేయడం కోసం కార్యాచరణ సరళమైన, రెజియో-సెలెక్టివ్ ప్రోటోకాల్లను అభివృద్ధి చేయడమన్నారు. ఈ పరిశోధన ద్వారా న్యూక్లియో సైడ్ లైబ్రరీ సంశ్లేషణ కోసం ఒక ఆచరణాత్మక హై-త్రుపుట్ పద్ధతిని ఏర్పాటు చేశామన్నారు. అందులో ఐదు నూతన ప్యూరిన్ న్యూక్లియో సైడ్ ఉత్పన్నాలు, కాపురామైసిన్, మైకా లిసిస్ వంటి జీవశాస్త్రపరంగా ముఖ్య మైన సహజ ఉత్పత్తుల ఎన్నాయని తెలియ జేశారు. రాజేంద్రప్రసాద్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మోత హర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.



ఆడపిల్ల వివాహానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన ఎరుకలి భాగ్యమ్మ కూతురు కవిత వివాహానికి మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్, జడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం యాదవ్ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న పేద వారికి సేవా చేయడంలో ఎంతో సంతృప్తి నిస్తుందన్నారు. వారి వెంట మేర వెంకటేష్, దొడ్డ చారి, మల్లేశం, రాజు, అన శేఖర్, తదితరులున్నారు.

భారత రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమిద్దాం



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, సామాజిక ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందిస్తున్న భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. డీబీఎఫ్ అధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యంలో భాగంగా జిల్లా రౌండ్ టేబుల్ సమావేశాన్ని శుక్రవారం సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయులైన పూలే, అంబేద్కర్, జగ్గీవన్‌రామ్ జయంతుల సందర్భంగా రాజ్యాంగ రక్షణ ప్రచారోద్యమాన్ని చేపట్టినట్టు చెప్పారు. విద్యా ఉద్యోగం, ఆస్తులు, సంపదలను రాజకీయ అధికారాన్ని అణగారిన వర్గాలకు మనువాదం దూరం చేసిందన్నారు. మానవ హక్కులను అందించిన రాజ్యాంగాన్ని 400 సీట్లు గెలిస్తే మారుస్తామని పదేపదే ప్రకటిస్తున్న కేంద్ర మంత్రుల కుట్రలను అర్థం చేసుకొని, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని విజ్ఞప్తి చేశారు. దళిత నేత మల్లయ్య మాట్లాడుతూ.. పదేండ్ల మోడీ పాలనలో వారిచ్చిన ఏ ఒక్క హామీని నేరవేర్చలేదన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కేంద్ర పాలకులు కాలరాస్తున్నారని అన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామనే హామీని నిలబెట్టుకోలేదని తెలిపారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ శ్రీకాంత్, డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు రజాక్, నాయకులు భుమేష్, భూమయ్య, శ్వేత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

క్రొమాటో గ్రఫీ ఆధునిక పద్ధతులపై రెండ్రోజుల శిక్షణ



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట అటానమస్ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో స్పిన్కో బయోటెక్, ఉస్మానియా కెమిస్ట్రీ ఫౌండేషన్ సహకారంతో అడ్వాన్స్ క్రొమాటోగ్రఫీ పద్ధతులపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన ఉస్మానియా కెమిస్ట్రీ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు, కళాశాల పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.ఆనంద రావు మాట్లాడుతూ.. రసాయన శాస్త్రంపై విద్యార్థులకు ఆసక్తిని పెంచేందుకు నిర్వహించే కార్యక్రమాల్లో తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ శిక్షణా కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, కెమిస్ట్రీ సబ్జెక్టుతో ఉపాధి అవకాశాలు పొందడానికి, నైపుణ్యాలు పెంచుకోవడానికి సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమ కన్వీనర్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వాసం శ్రీనివాస్ మాట్లాడుతూ.. పరిశ్రమలు విద్యాసంస్థలతో అనుసంధానమైనప్పుడే విద్యార్థులకు పూర్తిస్థాయి విషయ అవగాహన కలుగుతుందన్నారు. రసాయన శాస్త్ర కోర్సులకు డిమాండ్ పెరుగుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, విద్యార్థులందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఐబీసీటీ శాస్త్రవేత్త డాక్టర్ దేభాషీష్ సైన్ అడ్వాన్సుడ్ క్రొమాటోగ్రఫీ పద్ధతులపై ప్రసంగిం చారు. మధ్యాహ్న శిక్షణలో భాగంగా స్పిన్కో బయోటెక్ ప్రాం తీయ మేనేజర్ ఎస్ కృష్ణ, రీజనల్ లీడ్ అరుణ్ సింగ్ నాద్, వారి బృందం క్రొమాటోగ్రఫీ పరికరాలపై ప్రత్యక్ష శిక్షణ, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ వి. బాలకిషన్, కో కన్వీనర్లు ఆంజనేయులు, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ సుమలత, శ్యాంసుందర్, సలీం పాషా, డాక్టర్ రవికుమార్, కళాశాల పరీక్షా విభాగం నియంత్రణా అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్షా 98వేల నగదు పట్టివేత



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని హుస్సెలీ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో లక్షా 98వేల నగదు పట్టుబడినట్టు హద్నూర్ ఎస్‌ఐ రాము నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో కర్ణాటక-తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్టు చెప్పారు.

పలు శుభకార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం అధ్యక్షుడు జగనాథ్‌రెడ్డి, శ్వేత రాణి దంపతుల కుమారులు అఖిలేష్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి పుట్టు పంచల కార్యక్రమానికి అలాగే నూతన గృహప్రవేశ శుభకార్యానికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు హాజరయ్యారు. చిన్నారులను ఆశీర్వదించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విందును స్వీకరించారు. కాగా ఎమ్మెల్యే ను, స్థానిక నాయకులను జగనాథ్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, భాస్కర్, గ్రామ నాయకులు తుక్కా రెడ్డి, చంద్రప్ప, మాణిక్ రెడ్డి, రవికుమార్, తదితరులున్నారు.



విత్తనాలను రక్షిస్తే.. అవి మానవాళిని రక్షిస్తాయి

నవతెలంగాణ-జహీరాబాద్

విత్తనాలను రక్షిస్తే.. అవి మానవళి అందరిని రక్షిస్తాయని డీడీఎస్ సంఘం సభ్యులు ముగ్గులమ్మ నరసింహాలు అన్నారు. పస్తాపూర్‌లోని డీడీఎస్ కార్యాలయంలో ప్రపంచ విత్తన దినోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన విత్తనాల ప్రదర్శన కార్యక్రమానికి అధ్యక్షత వహించి ఆమె మాట్లాడారు. తమ సంఘం ఆధ్వర్యంలో 26 గ్రామాలకు చెందిన రైతులు 55 రకాల విత్తనాలను నేటికీ భద్రపరిచి.. వాటిని దేశ విదేశాలకు సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. డీడీఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విత్తన బ్యాంకులో జాతీయ, అంతర్జాతీయ వివిధ సంఘాల వారు అవార్డులు సైతం అందించారన్నారు. తాము నిరక్షరాశులైన మహిళలం అయినప్పటికీ.. సుమారు 56 రకాల విత్తనాలకు సంబంధించిన పౌష్టిక విలువలు, వాటి ప్రావిణ్యతను దేశ విదేశాల్లో తెలియజేసినట్టు చెప్పారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతీయేడు పాత పంటల జాతర నిర్వహిస్తూ.. ఆ జాతరలో ప్రత్యేకంగా ఎడ్లబండ్లలో విత్తనాలను ఊరేగిస్తూ నేడు ఆ విత్తనాల ప్రావీణ్యతను చాటి చెప్పడం జరుగుతున్నదన్నారు. ఒక రోజు విత్తన దినోత్సవం జరుపుకోవడమే కాకుండా.. వాటిని సంరక్షించేందుకు సంరక్షకులను ప్రభుత్వాలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విత్తనాల నిలువ ఉంచే బ్యాంకు నిర్వాహకులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిడిఎస్ సంఘం సభ్యులు మాణిక్యం, నరసమ్మ ,చంద్రమ్మ, రోజమ్మ ,చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు అంతా సిద్ధం చేసుకోవాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని బీఎల్వోలకు తహసీల్దార్ భూపాల్ సూచించారు. మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను శుక్రవారం సందర్శించి.. తగిన సౌకర్యాలు ఉన్నాయా లేదా పరిశీలించారు. మండలంలో 62 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని.. మొత్తం 48 వేల 163 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అన్ని గ్రామాల్లో బీఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తున్నారన్నారు.

బస్సు పాసుల దరఖాస్తులకు అవకాశం



నవతెలంగాణ-న్యాల్‌కల్

దివ్యాంగులు బస్సు పాసులకు దరఖాస్తు చేసుకోవడం 'బస్సు పాసుల మేళా' నిర్వస్తున్నట్టు నారాయణఖేడ్ డిపో మేనేజర్ మల్లేశం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులు మండలంలోని ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఆధార్ కార్డు సర్టిఫికెట్, రూ.50 తీసుకువచ్చి పాస్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్ 94410 71134 తెలియజేయాలన్నారు.



సీఎం బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో శుక్రవారం నిర్వహించిన సీఎం బహిరంగ సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి 20 వేల మంది పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొత్తపల్లి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తరలి వెళ్లిన వారిలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ మెటల్‌కుంట తిరుపతి రెడ్డి, సిద్ధి లింగయ్య స్వామి, వెంకట్ రెడ్డి, వెంకన్న, డా.అశోక్, సతీష్, జైపాల్ రెడ్డి, సమి తదితరులున్నారు.



కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

నవతెలంగాణ-సదాశివపేట

కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ.. కార్మిక చట్టాలను పెట్టుబడుదాలకు అనుకూలంగా మార్చడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్ అన్నారు. మేడే సందర్భంగా నిర్వహించనున్న ఆటల పోటీల్లో భాగంగా శుక్రవారం సిద్దాపూర్ కాలనీలో ఉన్న ఈద్గా మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల నైపుణ్యాన్ని వెలికితీయడం కోసం ఈ ఆటల పోటీలు ఉపయోగపడతాయన్నారు. కార్మికుడు పరిశ్రమలో 8 గంటలు పని చేస్తూనే ఈ క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కానీ నేటి పాలకులు కార్మికులకు అనుకూలంగా ఉండే చట్టాలను మొత్తం మార్చి పెట్టుబడుదారులకు అనుకూలంగా తయారు చేస్తున్నారని మండిపడ్డారు. ఎనిమిది గంటల పని విధానం స్థానంలో 12 గంటలు పని విధానాన్ని తెస్తున్నారన్నారు. కార్మికుల మధ్య చీలికలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాపాడడం కోసం కార్మికులందరూ ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో మెదక్ ఎంఆర్ఎఫ్ ప్లాంట్, ఎంఆర్ఎఫ్ ఏపీఎల్ పరిశ్రమ, పెబ్ పెన్నర్ పరిశ్రమ కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడే నిర్వహణ కమిటీ సభ్యులు బొబ్బిలి రాజయ్య అనిల్, ఎన్ శ్రీనివాస్, మల్లేశం, నాయుడు, నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎండలో.. జరభద్రం



- అధిక ఉష్ణోగ్రత, వడగల్పులతో అనారోగ్య సమస్యలు
- శరీరం నీటిశాతం కోల్పోకుండా జాగ్రత్తపడాలి
- పరిశుభ్రమైన నీటినే తీసుకోవాలి
- బయటి ఆహారానికి దూరంగా ఉండాలి
- వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు అప్రమత్తంగా ఉండాలి
- వడదెబ్బ అనుమానం వస్తే వైద్యుడిని సంప్రదించాలి
- నిపుణుల సూచనలు

నవతెలంగాణ-పటాన్‌చెరు

వేసవి సెగలు మొదలయ్యాయి. సూర్య తాపం పెరిగింది. భానుడి భగభగలు పెరుగుతుంటే మనిషికి సమస్యలు మొదలవుతాయి. ఎండా మండి పోతుండడంతో జనం అలసి సొలస్తున్నారు.అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో ప్రధానంగా వినిపించే మాట వడదెబ్బ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ శరీరం వేడెక్కి పోతుంది. శరీరాన్ని సమస్థితికి తీసుకువచ్చే పనిలో చెమట రూపంలో నీరు ఎక్కువగా బయటకు పోతుంది. శరీరంలో నీటి శాతం తగ్గడమే పెద్ద ప్రమాదం. నీటిశాతం తగ్గితే.. అలసట, నీరసం, నిస్సత్తువ ఆవరించి అనారోగ్యం వెంటాడుతుంది. ఇంట్లో ఉంటే ఉక్కపోత, బయటకు వెళితే సూర్యతాపం, ఉక్కిరి బిక్కిరి చేసే ఉష్ణోగ్రత.. దాంతో శరీరం శక్తి కోల్పోతుంది. గొంతు తడారిపోతుంది. దాహర్తి వెంటే ఉంటుంది. ఇన్ని సమస్యన్నా.. పనులుంటే బయటకు వెళ్లక తప్పని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వేసవిలో శరీరాన్ని నీటితో నింపడం పనిగా పెట్టుకోవాలని సూచిస్తున్నారు. ఎంత ఎక్కువ నీరు తాగితే సమస్యలు అంత దూరం అవుతాయంటున్నారు. దీనితోపాటు ఇంటి ఆహారము. వెంటే రక్షణ పరికరాలు తప్పనిసరిగా తీసుకువెళ్లాలి.

పరిశుభ్రమైన నీటినే తాగాలి..

వేసవిలో తాగే నీరు పరిశుభ్రంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. కలుషిత నీటి వల్ల అతిసార, మలేరియా వంటి సమస్యలు రావొచ్చని హెచ్చరిస్తున్నారు. ఎండ తీవ్రత పెరిగే కొద్దీ ఎక్కువ నీటిని తాగుతామని.. ఇంట్లో అయితే పరిశుభ్రమైన నీరు అందుబాటులో ఉంటుంది.. కానీ బయటికి వెళ్లినప్పుడు ఆ పరిస్థితి ఉండదు. కాబట్టి పని మీద బయటకు వెళ్ళినప్పుడు వాటర్ ప్యాకెట్లు, చలివేంద్రంలో నీరు, బోర్ల వద్ద నీటిని తాగుతుంటారని.. అవి అంత సురక్షితమైనవిగా ఉండకపోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఆ నీటి వల్ల వ్యాధులు వచ్చే అవకాశం కూడా ఉంటుందంటున్నారు. కాబట్టి బయటికి వెళ్లేటప్పుడు ఇంటినుంచే వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లాలని సూచిస్తున్నారు.

చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి..

వేసవిలో చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చిన్నపిల్లలకు ఏమైనా ఇబ్బందులు వచ్చినా.. స్వతహాగా వారు చెప్పలేరు కాబట్టి వారి ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులే అప్రమత్తంగా ఉండాలంటున్నారు. అంతేకాకుండా పిల్లలు వేగంగా వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. కాబట్టి గాలులకు శరీరంలో నీటిశాతాన్ని కోల్పోకుండా.. తగినంతగా ఎప్పటికప్పుడు వారికి ఇవ్వాలన్నారు. శిశువులకయితే తల్లిపాలను అధికంగా అందించాలన్నారు. పెద్దవాళ్ల యితే ఎప్పటికప్పుడు తాజా పండ్ల రసాలు, ఓఆర్ఎస్ పౌడర్, గ్లూకోజ్ కలిపిన నీటిని తాగాలన్నారు. ఎండలో బయటకు వెళ్లకుండా చూసుకోవాలని, వెళ్లాలని మారం చేస్తే వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే పంపాలన్నారు. కాటన్ దుస్తులనే ఎండాకాలం పూర్తయ్యే వరకు వాడాలన్నారు. ఈ సీజన్‌లో పిల్లలకు అమ్మవారు సోకే ప్రమాదం ఉన్నందున మూఢనమ్మకాల జోలికి పోకుండా వైద్యుని సంప్రదించాలన్నారు. చర్మ సంబంధిత సమస్యలు ఇబ్బంది పెట్టే అవకాశం ఉందని.. కాబట్టి చిన్నపిల్లలను అప్రమత్తంగా చూసుకోవాలన్నారు.

వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

వేసవిలో వృద్ధుల్ని ప్రధానంగా పీడించే సమస్య డిహైడ్రేషన్. చెమట రూపంలో శరీరం నుంచి నీరు అధికంగా బయటకు వెళ్ళిపోయి నీరసం ఆవహిస్తుంది. హైపోనైట్రోమియా, హైపొకెలిమియా బారిన కూడా పడుతుంటారు. ఎండ వేడిమి వల్ల సోడియం, పొటాషియం స్థాయి తగ్గిపోతుంది. శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి నీరసం పెరుగుతుంది. కాబట్టి ఎండ తీవ్రత వల్ల వృద్ధుల్లో కొన్ని ఇబ్బందులు కనింపంచే అవకాశం ఉన్నది. కళ్లు తిరగడం వంటి సమస్యలు ఎదురవుతాయి. శ్వాసకోశ వ్యాధులతో బాధపడేవారు వేడి గాలుల వల్ల ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. ఎండలో తిరగాల్సి వస్తే మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. శరీర ఉష్ణోగ్రతలో స్పష్టమైన మార్పు కన్పిస్తుంది. వృద్ధులు ప్రత్యేకంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య బయటకు వెళ్లకూడదుని.. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే గొడుగు పట్టుకుని వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి వద్ద తగినంత గాలి వెలుతురు వచ్చే చోట కూర్చోవాలని.. ఆ ప్రాంతంలోనే నిద్రపోవాలన్నారు. ఉప్పు పంచదార కలిపిన నీటిని ఎక్కువగా తీసుకోవాలని.. పండ్ల రసాలు ఎంత తాగితే అంత మంచిదన్నారు. వాటిని కూడా ఇంట్లో తయారు చేసుకోవాలని సూచిస్తున్నారు. వ్యాధిగ్రస్తులు మాత్రం వీటికి దూరంగా ఉండాలని.. టీ, కాఫీ లకు దూరంగా ఉంటే ఇంకా మంచిదంటున్నారు. అతి చల్లని నీరు, కూల్ డ్రింక్స్ తీసుకోవద్దని.. మందులు వాడేవారు మోతాదు మించకుండా జాగ్రత్తపడాలన్నారు. అన్ని వేళలా అందుబాటులో నీటిని ఉంచుకోవాలని.. వేడిగా ఉందని అనిపించినప్పుడు శరీరాన్ని తడిగుడ్డతో తుడుచు కోవాలన్నారు.

గర్భిణీలకు ఎదురయ్యే సమస్యలు..

వేసవిలో గర్భిణీలు చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. అలసత్వం వహిస్తే తల్లి బిడ్డ ఇద్దరికీ ప్రమాదమే అని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా శరీరం నీటిని కోల్పోవడం పై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎప్పటికప్పుడు పోగొట్టుకున్న నీటిశాతాన్ని భర్తీ చేయాలన్నారు. నీటిని కోల్పోయే స్థితికి శరీర తత్వం పై ఆధారపడి ఉంటుందని.. నీరు లాస్ అయితే పెరుగుదల పై ప్రభావం పడుతుందన్నారు. చుట్టూ ఉన్న నీటి శాతం (ఉమ్మనీరు) ప్రాథమిక దశలో తగ్గితే గర్భస్రావం జరుగుతుందన్నారు. నెలల సమయంలో అయితే బిడ్డ చనిపోయే ప్రమాదం ఉంటుందంటున్నారు. స్వచ్ఛమైన నీరు మజ్జిగ, కొబ్బరినీళ్లు,, తాజా పండ్ల రసాలు, ఎలక్ట్రోరల్ పౌడర్ కలిపిన నీరు తాగాలని సూచిస్తున్నారు. శరీరం వేడెక్కి వాంతులు, విరోచనాలు, కళ్ళు బైర్లు కమ్మడం ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచిస్తున్నారు.

వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్త పడాలి..

వేసవిలో అత్యంత ప్రమాదకరమైనది వడదెబ్బ(సన్‌స్ట్రోక్). దీన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మూత్రపిండాలు, కాలేయం ఇతర భాగాల పనితీరుపై పడే ప్రమాదం ఉంది. స్వేద గ్రంధులు పూడుకుపోతే చర్మ వ్యాధులు రావచ్చు. వడదెబ్బ బాధితులు శరీరంలో నీటి శాతం పెరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కొబ్బరి నీరు. గ్లూకోజ్. ఎలక్ట్రో రల్ పౌడర్ వంటివి అందుబాటులో లేకుంటే చక్కెర. ఉప్పు కలిపిన నీటిని తాగాలి. వడదెబ్బ దరిచేరకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి.

– నాగేశ్వరరావు, వైద్యులు

ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ..

- ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో పట్టుబడిన వ్యక్తి
- పోలీసులకు సమాచారం ఇచ్చేలోగా పరార్

నవతెలంగాణ-రామచంద్రాపురం

ఒకరికి బదులు మరో వ్యక్తి పరీక్ష రాస్తూ పట్టుబడ్డాడు. పోలీసులకు సమాచాం అందజేసేలోగా పరీక్షా హాల్ నుంచి అతడు పరారయ్యాడు. ఈ ఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై శశికాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురంలోని భేల్ లో గల జిల్లా పరిషత్ పాఠశాలలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ ఇంగ్లీష్ పరీక్షను శుక్రవారం నిర్వహించారు.దాంట్లో అమర్ నేని ఓంకార్ అనే విద్యార్థి పరీక్ష రాయాల్సి ఉండగా.. మరో వ్యక్తి రాస్తుండటాన్ని పరీక్ష గమనించారు. విద్యార్థి హాల్ టికెట్‌ను పరిశీలించగా.. ఫోటో మరొకరిది ఉన్నది. దాంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చేలోపు పరీక్ష రాస్తున్న వ్యక్తి పరారయ్యాడు. సూపరింటెండెంట్ శంకర్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీఏ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంపులు ప్రారంభం



నవతెలంగాణ-జహీరాబాద్

సమ్మర్ క్యాంపులతో విద్యార్థులు చైతన్యవంతులుగా మారుతారని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ వెంచర్ వద్ద హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. జహీరాబాద్ పట్టణంలో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. నిర్వాహకులు సంపత్ కుమార్ ప్రతీయేడు ఈ క్యాంపు నిర్వహించడంతో.. స్థానిక విద్యార్థులు క్రికెట్ పట్ల ఆకర్షితులై నేర్చుకునేందుకు ముందుకు వస్తున్నారన్నారని.. ఇది మంచి పరిణామమన్నారు. వేసవి సెలవుల్లో చెరువులు, బావుల వద్దకు వెళ్లి ప్రాణాలను కోల్పోకుండా.. ఇలాంటి క్యాంపులను సద్వినియోగం చేసుకో వాలన్నారు. ఈ విషయమై చిన్నారుల తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి ఇబ్రహీం, సంపత్ కుమార్, అబ్దుల్ మతిన్, ఆల్తిఫ్, ఎండి అన్వర్, సంతోష్, ఎండి మహమ్మద్, ఎండి ఇమ్రాన్ ఖాన్, ఎండి ఇమ్రాన్, చిన్నారులు, క్రికెట్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వివిధ శుభకార్యాల్లో పాల్గొన్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ కల్యాణ మండపాల్లో శుక్రవారం జరిగిన శుభకార్యాలకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ నరోత్తం హాజరై.. నూతన వధవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని ఉత్తమ్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మొగుడంపల్లి మండలం ఔరంగనగర్ గ్రామం ఎనగుంది ముకుంద్ రెడ్డి కుమార్తె వివాహానికి, పట్టణంలోని యస్.వి.ఫంక్షన్ హల్‌లో జరిగిన సి.యం.జనార్దన్ రెడ్డి కుమారుని వివాహానికి, పట్టణంలోని ఎన్.కన్వెన్షన్ హాల్ లో జరిగిన జహీరాబాద్ మండలం రాయిపల్లి డి.గ్రామం కెంపుల వేణు గోపాల్ కుమార్తె వివాహానికి, జహీరాబాద్ మండలం ఖాసింపుర్ గ్రామంలో జరిగిన మాజీ ఎంపీటీసీ బి.రాజు సోదరుని వివాహానికి, కోహిర్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన కె.నర్శింలు సోదరుని కుమార్తె వివాహానికి, పట్టణంలోని శుభం కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కోహిర్ మండలం మద్రి గ్రామం ఎస్.బిచ్చప్ప కుమా రుని వివాహానికి నరోత్తం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో ఎంపీపీ ఉపాధ్యక్షులు వి.రాములు మాణిక్ ప్రభుగౌడ్, మాజీ సర్పంచ్ నర్శింలు, రాంచందర్, శ్రీనివాస్, రాజు, విఠల్, మోహన్, మాణిక్‌రెడ్డి, సి.యం.మాణిక్ రెడ్డి, కృష్ణ, నర్సింహారెడ్డి, కిష్టయ్య టీచర్, శేఖర్, పాండురంగా రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, అమృ త్, శ్రీనివాస్, చెంగల్ జైపాల్, క్రిష్టారెడ్డి, మాణయ్య, మల్లన్న, అంజయ్య,విష్ణు తదితరులు పాల్గొన్నారు

నియోజకవర్గ పాస్టర్ల సమావేశాన్ని జయప్రదం చేయాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకటరామిరెడ్డికి మద్దతుగా మే 4న పటాన్‌చెరులో నిర్వహించ తలపెట్టిన నియోజకవర్గ స్థాయి చర్చి పాస్టర్ల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం పటాన్‌చెరులో నియోజకవర్గ ముఖ్య చర్చి పాస్టర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్లమెంటులో తెలంగాణ వాదం బలంగా వినిపించాలంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గత 10 ఏండ్ల కాలంలో నియోజ కవర్గంలోని క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించడంతోపాటు, సొంత నిధులతో 30కి పైగా చర్చిలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. వీటితో పాటు క్రిస్టియన్ల కోసం ఐదు ఎకరాలను స్మశాన వాటిక కోసం కేటాయించడం జరిగిందన్నారు. మెదక్ బరిలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి విజయానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మెన్ విజయకుమార్, నగేష్ యాదవ్‌తదితరులు పాల్గొన్నారు.



తాజా మాజీ సర్పంచుల నుంచి పంచాయతీ ముద్రలను తీసుకోవాలి

నవతెలంగాణ-గుమ్మడిదల

తాజా మాజీ సర్పంచుల నుంచి పంచాయితీలకు సంబంధించిన ముద్రలను వెంటనే కార్యదర్శులు తీసుకోవా లని.. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచి ంచారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాల యంలో ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన శుక్రవా రం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ.. గ్రావ వాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో హెల్త్ సెంటర్ భవనాలు నిర్మిస్తున్నప్పటికీ.. వాటి నిర్మాణంలో నాణ్యతా లోపం ఉన్నదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రావాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా భూ అక్రమాలు ఇప్పుడిప్పుడే వెలు గులోకి వస్తున్నాయని.. వాటిని సంబంధిత శాఖ అధికా రులు పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రా లు ఇచ్చినట్టు తెలిపారు. కాగా మండలంలో మొత్తం పది ఎంపీటీసీ అభ్యర్థులు ఉండగా.. చిట్టి చివరి సర్వసభ్య సమా వేశానికి కేవలం ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారు. గ్రామాల్లో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో సమస్యలపై ఎలాంటి చర్చలు జరపకుండా కేవలం ముఖ్యమైన అంశాలపై ఎంపీటీసీలు మాట్లాడారు. ఎంపీపీ సద్ది ప్రవీణ మాట్లాడుతూ.. గ్రామా ల్లోని సమస్యలు, ఎంపీటీసీలు లేవనెత్తిన ప్రతీ సమస్యకు పరిష్కార దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని గ్రామపంచాయతీల్లో తాగు నీరు సమస్య రాకుండా ఎప్పటికప్పుడు సమీక్షించాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. చిట్టచివరి సర్వ సభ్య సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ కుమార్ గౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు నక్క మంజుల వెంకటేష్ గౌడ్, తహసిల్దార్ గంగాభవాని, ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీటీ సీలు సురభి నాగేందర్ గౌడ్, మద్ది మల్లమ్మ, బేగరి లక్ష్మి, గోవర్ధన్‌గౌడ్, చిదు పద్మ కొండల్ రెడ్డి, బుద్దుల పార్వ తమ్మ లతో పాటు పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యద ర్శులకు, మండల సిబ్బంది సిబ్బంది తమకు ఐదేళ్ల పాలనలో అందించిన సహాయ సహకారాలకుధన్యవాదాలు తెలిపారు.

శ్రీ కాళికేయ మాత విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-వెల్దుర్తి



మండల పరిధి మన్నె వారి జలాల్పూర్ గ్రామంలో గత మూడు రోజుల నుంచి శ్రీ కాళికేయ మాత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు సత్యనారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీ కాళికేయ మాత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని ఇంత పెద్ద విగ్రహం ఎక్కడ లేదని వెల్దుర్తి మండలం మన్నె వారి జలాల్పూర్ గ్రామంలో విగ్రహ ప్రతిష్ట చేయడం శుభ పరిణామమన్నారు. నిత్య దూప దీప నైవేద్యం ఆచరించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. అమ్మవారిని మనసులో తలచుకొని ఏ పనులు ప్రారంభించినా శుభం జరుగుతుందన్నారు. నలుమూలల నుంచి అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎంపీటీసీ మోహన్ రెడ్డి గ్యాస్ శ్రీనివాస్ రెడ్డి, కుకునూరు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ విగ్రహాలను ఇప్పిస్తా

డాక్టర్ మోహన్ నాయక్ హామీ

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి తాండలో నిర్మిస్తున్న సేవాలాల్ మందిరానికి విగ్రహాలను అందజేస్తానని డాక్టర్ మోహన్ నాయక్ హామీ ఇచ్చారు. సేవాలాల్ మందిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మందిరాన్ని బచ్చురాజుపల్లి తండావాసులు నిర్మించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. సేవాలాల్ మందిరంలో సేవాలాల్, మేరమ్మల విగ్రహాలను ప్రతిష్ఠించడానికి తన వంతు సహాయంగా విగ్రహాలను ఇప్పిస్తానన్నారు. ఇందుకుగాను డాక్టర్ మోహన్ నాయక్‌కు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పేదింటి ఆడపిల్లకు పుస్తె మట్టెలు అందజేత

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని షౌకత్ పల్లి వడ్డెర కాలనీకి చెందిన వల్లెపు కనకయ్య, పద్మల కూతురు అశ్వినీ పెళ్లికి జబ్బర్ తండాకు చెందిన డాక్టర్ మోహన్ నాయక్ పుస్తె మట్టెలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ మండలంలో పేదింటి ఆడపిల్లల పెళ్లికి పుస్తె మట్టెలను అందజేస్తానన్నారు. కూలి పనులు చేసుకునే కనకయ్య, పద్మ దంపతుల కూతురు వివాహానికి పుస్తే మట్టేలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చు రాజు పల్లి రామావత్ కిషన్, స్వామి, సరోజ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బతుకమ్మ కవిత.. ఢిల్లీలో లిక్కర్ దందా

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘునందన్ రావు

నవతెలంగాణ-నిజాంపేట



తెలంగాణ బతుకమ్మగా పిలువబడి కవితమ్మ బతుకమ్మ ఆడకుండా ఢిల్లీలో లిక్కర్ దందా పెట్టిందని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షోలో భాగంగా మహిళలు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి, హరీష్ రావు ఇద్దరు ఒకటేనని ఇద్దరు కలిసి మీడియా ముందు తిట్టుకుంటారే గాని వారిద్దరి మనస్తత్వం ఒకటేనన్నారు. హరీష్‌రావు బీఆర్ఎస్‌ను వదిలి సొంత పార్టీ పెట్టుకుంటాడన్నారు. ఏమి తెలియని అయోమయంలో కేటీఆర్ ఉన్నాడన్నారు. తెలంగాణ ముద్దుబిడ్డ బతుకమ్మగా కవితను పొగిడారని కానీ ఢిల్లీలో సారా వ్యాపారం చేసిందన్నారు. చేసిన పాపం ఊరికే పోతాదా అని, పాపం పండి తీహార్ జైల్లో ఊసలు లెక్కబెడుతుందన్నారు. ఢిల్లీ నుంచి గల్లి వరకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయన్నారు. రైతులకు గెలవగానే 2 లక్షల రుణమాఫీ అని ప్రకటించి ఇప్పటికీ రుణమాఫీ చేయలేదన్నారు. ముఖ్యమంత్రి ఆగస్టు లో రుణమాఫీ చేస్తానని మాట్లాడడం ఓట్ల కోసమేనన్నారు. ప్రజలను మభ్యపెడుతూ అధికారం దక్కించుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీజేపి సీనియర్ నాయలు, జెడ్పిటిసి పంజా విజయ్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, రామాయంపేట బీజేపి నాయకులు శంకర్ గౌడ్, సుధాకర్ రెడ్డి, బీజేపి నాయకులు తీగల శ్రీనివాస్ గౌడ్, ఆకుల రమేష్, నరేష్ మహంకాళి, చంద్రశేఖర్ తదితర బీజేపి నాయకులు పాల్గొన్నారు.

29న ఒక రోజు వర్క్ షాప్

నవతెలంగాణ-మెదక్ టౌన్



ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ రసాయన శాస్త్ర విభాగము ఆధ్వర్యంలో ఈ నెల 29వ రోజు వర్క్ షాప్ కార్యక్రమానికి సంబంధించి, బ్రోచర్ విడుదల చేసినట్లు రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె రమణ తెలిపారు. రసాయన శాస్త్రంలో జరిగే అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు తెలుపుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ది పొందాలని తెలిపారు. వేణుగోపాలరావు రసాయన అధ్యాపకులు రసాయన శాస్త్రంలో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ సింహా రెడ్డి, డాక్టర్ తిరుమలరెడ్డి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ దినకర్, డాక్టర్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

దుర్గా భవాని సన్నిధిలో మొక్కు చెల్లించిన గడ్డం మహేష్

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు గెలిస్తే ఏడుపాయల దుర్గాభవాని సన్నిధిలో తలనీలాలు సమర్పిస్తానని కార్యకర్త గడ్డం మహేష్ మొక్కుకున్నారు. రోహిత్‌రావు ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో శుక్రవారం ఏడుపాయల దుర్గా భవాని సన్నిధిలో తలనీలాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించాడు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ప్రతి కార్యకర్త సంతోషంగా ఉన్నాడని తెలిపారు. ఆయన వెంట మాజీ వార్డ్ సభ్యుడు లెంక రాజు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



ప్రమాదవశాత్తు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. హవేలిఘనపూర్ ఏఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ముత్తాయిపల్లి గ్రామానికి చెందిన దాసరి ఏగోండ (55) శుక్రవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై హవేలిఘనపూర్ నుంచి ముత్తాయిపల్లికి వెళ్లే క్రమంలో ముత్తాయిపల్లి గేటు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏగోండ తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాద సంఘటన చూసిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.మృతుడు ఏగోండకు భార్య అనసూయ ఒక కుమారుడు ఉన్నారు.

దుర్గమ్మ ఆలయంలో జెడ్పీటీసీ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామంలో దుర్గమ్మ పండుగకు జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి శుక్రవారం హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జడ్పిటిసిని ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లేశం శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా లద్నూరు గ్రామంలో బొడ్రాయి పండుగ సందర్భంగా జడ్పిటిసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బైరాన్ పల్లి మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్, కూకట్ల బాలరాజు యాదవ్, దాసరి పద్మా రెడ్డి, రామడుగు బాలరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు

ఒక్కటి తిరస్కరణ..53 అభ్యర్థుల నామినేషన్ ఆమోదం

- మెదక్ పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి
- 54 మంది అభ్యర్థుల నామినేషన్ దాఖలు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్



మెదక్ పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లోని ఆర్ఓ కార్యాలయంలో నిర్వహించిన స్క్రూటినీ ప్రక్రియలో ఎన్నికల సాధారణ పరిశీలకులుగా సమీర్ మాధవ్ కుర్కోటి, పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో పరిశీలన చేపట్టగా ఆయా పార్టీల అభ్యర్థులు హాజరయ్యారు. ఒక్క నామినేషన్ తిరస్కరణకు గురవగా, 53 నామినేషన్లను ఆమోదించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ మాట్లాడుతూ. మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్‌కు 54 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 53 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగానే ఉన్నాయని, ఒక్క నామినేషన్ తిరస్కరించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకు కొనసాగిన నామినేషన్ ప్రక్రియలో భాగంగా మొత్తం 54 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా, ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కళ్ళు నరసింహులు గౌడ్ ఎన్నికల నియమావళి ప్రకారం కొత్త ఓటర్ల లిస్టు, పార్ట్ నెంబర్, సీరియల్ నెంబర్, ప్రపోజల్స్ సరైన పత్రాలు సమర్పించని సందర్భంలో స్క్రూటీనిలో భాగంగా నామినేషన్‌ను తిరస్కరించడం జరిగిందన్నారు. 53 మంది నామినేషన్లను ఆమోదించడం జరిగిందన్నారు. శనివారం కేంద్ర ప్రభుత్వం సెలవు దినంగా ఉన్నందున నామినేషన్ ఉపసంహరణ చేసుకునేవారు శుక్రవారం 5 గంటల తర్వాత నుంచి ఉపసంహరణ ఫామ్ సబ్మిట్ చేయవచ్చని, తదుపరి ఈనెల 29 సోమవారం సబ్మిట్ చేయాలని చెప్పారు. అభ్యర్థి వ్యయానికి సంబంధించిన పుస్తకాలు అభ్యర్థులకు అందజేయడం జరిగిందని, నామినేషన్ వేసిన అభ్యర్థులు తప్పనిసరిగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలని, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించినప్పుడు ముందస్తు అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. అభ్యర్థుల ఖర్చులు ఆ అకౌంట్ ద్వారానే నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ ఏజెంట్ రాండమైజేషన్ ప్రక్రియలో హాజరుకావాలని అసెంబ్లీ కాన్స్టెన్సీ పరిధిలో పోలింగ్ స్టేషన్స్ అలాట్మెంట్ చేయడం జరిగిందన్నారు. ఈవీఎం రిలేటెడ్ కార్యక్రమాల్లో పాల్గొనడానికి పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాల్సి ఉంటుందని హెూమ్ ఓటింగ్ ప్రక్రియలో 85 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు 40 శాతం పైబడిన వికలాంగులకు ఫారం 12 డి అందజేయడం జరిగిందని తెలిపారు. ఏ రోజు ఎక్కడ హెూమ్ వోటింగ్ జరుగుతుందనే పూర్తి వివరాలు లిస్ట్ అందజేయడం జరుగుతుందని బూత్ లెవెల్ ఏజెంట్ హాజరై ఓటింగ్ ప్రక్రియను పరిశీలించవచ్చని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు మెదక్, నర్సాపూర్ ఆర్డీవో, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో పోస్టల్ ఓటింగ్ సెంటర్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఓటింగ్ ప్రక్రియ ఎలా జరుగుతుందనే విషయాన్ని పరిశీలించవచ్చన్నారు. ప్రతిరోజు నివేదికల మీద పొలిటికల్ పార్టీ ప్రతినిధుల సంతకాలు చేయాల్సి ఉంటుందన్నారు.

ముగ్గురిపై క్రిమినల్ కేసులు

క్రిమినల్ కేసులు వివరాలుకి వస్తే ముగ్గురు అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఉన్నాయని రఘునందన్ రావు (బీజేపీ), నీలం మధు (కాంగ్రెస్), వెంకటరామిరెడ్డి (బీఆర్ఎస్) మూడుసార్లు న్యూస్ పేపర్లో వారికి ఇచ్చిన ప్రొఫార్మాలు ప్రచురణ చేయాల్సి ఉంటుందని దానికి సంబంధించిన తేదీలు కూడా వారికి నామినేషన్ పేపర్లు సబ్మిట్ చేసినప్పుడే చెప్పడం జరిగిందన్నారు. ర్యాలీలు, సభలు సమావేశాలు నిర్వహించినప్పుడు తప్పనిసరిగా ఏఆర్ఓ నర్సాపూర్, ఏఆర్ఓ మెదక్ 48 గంటల ముందు అనుమతి కొరకు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని, 24 గంటల లోపు అనుమతి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనుమతి లేకుండా ఎన్నికల నియమాలు ఉల్లంఘించి ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా సంబంధిత అభ్యర్థిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు సమీర్ మాధవ్ కుర్కోటి కోరారు. మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికి రిటర్నింగ్ అధికారి తీసుకుంటున్న చర్యలు, చెక్ పోస్టుల ద్వారా తనిఖీలు, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల నమోదు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని, ఇదే ఒరవడి కొనసాగించి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు పాల్గొన్నారు.

ఎండాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-చేగుంట



ఎండాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీపీ మసుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎండాకాలం వాటర్ సమస్య చాలా ఉంది. అక్కడక్కడ మినీ బోర్ల నీరు వృధా అవుతున్నాయని, చేగుంటలో ఈ సమస్య బాగా ఉందని, వెంటనే అరికట్టాలని ఈవో నాగభూషణంకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ మండలంలోని వైకుంఠధామాలకు కరెంటు ఎస్టిమేషన్, డీడీలు కట్టి ఏడు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు కరెంటు మంజూరు కాలేదని కార్యదర్శులు ఆరోపించారు. ప్రభుత్వ వైద్య అధికారి మాట్లాడుతూ ఎండాకాలంలో జాగ్రత్త వహించాలని, సుమారు 40 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదవుతుందని, బయటికి వెళ్లేవారు గొడుగు, నెత్తిపై టవల్, బాడికి కావాల్సినంత నీరు తాగాలని, ఎక్కువ ద్రవ పదార్థాలు తీసుకోవాలని కోరారు. సరైన నీరు ఇవ్వకపోతే జ్వరంతోపాటు ఇతర ఆనారోగ్య సమస్యలు ఏర్పడతాయని ప్రతి ఒక్కరూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చిన్నచిన్న లోపాలు ఉన్నాయని ఎంపీటీసీలు ఆరోపించారు. చేగుంట మక్క రాజుపేట రోడ్డు నాలాలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఇరిగేషన్ అధికారులు, చేగుంట పట్టణ ఈవో భూషణం తగిన చర్యలు తీసుకొని, నిర్మాణాలను డిస్మెంటల్ చేయాలని, లేదంటే వర్షాకాలంలో కాలువలు నిండి ఎస్సీ కాలనీ నీరుతో నిండి మునిగిపోయే అవకాశం ఉందని, ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ఇరిగేషన్ ఏఈ మమతకు సూచించారు. అలాగే రుక్మాపూర్‌లో చెరువుకుంటల సమస్యలు చాలా ఉన్నాయని రెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ మేకల పరమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంగన్వాడి సూపర్వైజర్ సువర్ణశైని, ఐకే పి ఏపీఎం లక్ష్మీనరసమ్మ, ఆర్ ఐ యాదగిరి యాదవ్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు హాలియ, గణేష్, భిక్కి లక్ష్మీ రమేష్, లత నందం, సీనియర్ అసిస్టెంట్ విజయ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

29 కార్మిక చట్టాల పునరుద్ధరణకై బీజేపీని ఓడిద్దాం

- దేశాన్ని రాజ్యాంగాన్ని ప్రజలను రక్షించుకుందాం
- ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్

నవతెలంగాణ-నిజాంపేట



138వ మేడే దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవాలని, 29 కార్మిక చట్టాల పునరుద్ధరణకై బీజేపిని ఓడించాలని, దేశాన్ని రాజ్యాంగాన్ని ప్రజలను రక్షించుకోవాలని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అయ్యవారి లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలోని కొత్త బస్టాప్ వద్ద మేడే కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికులారా ఏకంకండి పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో పౌర ప్రజాస్వామ్య పాలన అంతమైందని పెట్టుబడిదారీ విధానం కొనసాగుతున్నదన్నారు. కార్మిక వర్గం దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 కార్మిక చట్టాలను సమూలంగా రద్దుచేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా 4 కోడ్‌లను తెచ్చింది. రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వం 3 రైతు వ్యతిరేక చట్టాలను విద్యుత్ బిల్లులను బలవంతంగా రైతులపై ప్రజలపై రుద్దే ప్రయత్నం చేసింది. లేబర్ కోడ్‌లను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ ఈఎస్ఐ గ్రాటిట్యూటీ బోనస్ పెన్షన్ చట్టాలను అమలు చేయాలన్నారు. హమాలి ఆటో ట్రాన్స్పోర్ట్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తేవాలని, యూనియన్ల రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు 600 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బాలా గౌడ్, తిరునాహరి శ్రీనివాస్, ఏసు ప్రవీణ్, బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ముప్పు

మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ్

నవతెలంగాణ-కౌడిపల్లి



భారతదేశంలో బీజేపీ మూడోసారి అధికారం చేపడితే రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతుందని జాతీయ మాల మహానాడు మెదక్ జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఊరట్ల శివయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 400కు పై స్థానాలు వచ్చి అధికారం చేపడితే భారత రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందన్నారు. కావున బీజేపీకి అధికారంలోకి రాకుండా భారత రాజ్యాంగ రచన సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు భారత రాజ్యాంగ యొక్క విశిష్టతను తెలియజేస్తూ బీజేపీ మోసాలను ప్రజలకు త్వరలో కౌడిపల్లి మండల వ్యాప్తంగా మాల మహానాడు సంఘం వివరిస్తుందని తెలిపారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఊరట్ల శివయ్య, మండల్ మహానాడుయూత్ అధ్యక్షులు నాగేష్, నర్సాపూర్ మండల అధ్యక్షులు గోవు యాదగిరి,. కౌడిపల్లి మండల అధ్యక్షులు నిరుడి కుమార్, నర్సాపూర్ మండల కార్యదర్శి తాళ్ల ఆనంద్, జిల్లా నాయకులు మాణిక్యం .శేరిపల్లి బాబు పాల్గొన్నారు .

కాంగ్రెస్‌లోకి వలసలు షురూ

నవతెలంగాణ-చిలిపిచెడ్



కాంగ్రెస్ పార్టీలోకి చిలిపిచేడ్ మండలం నుంచి వలసలు షురు అయ్యాయి. గౌతపూర్ గ్రామంలో చిలిపిచేడు మండల వైస్ ఎంపీపీ విశ్వంభర స్వామి చక్రం తిప్పుతూ నాయకులను కార్యకర్తలను పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు ముమ్మరం చేస్తున్నారు. గౌతాపూర్ గ్రామం నుంచి శ్రీనివాస్ రెడ్డి, అంజిరెడ్డి, ఉప సర్పంచ్ అక్షయ గోవర్ధన్ రెడ్డి, నరసింహ రెడ్ బీఆర్ఎస్ పార్టీని వీడి 150 మంది కార్యకర్తలతో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ సమక్షంలో గౌతాపూర్ గ్రామస్తులు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. గౌతాపూర్ గ్రామం బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్నా, నేడు గులాబీ పార్టీ నుంచి కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో గులాబీ పార్టీకి ఎదురుదెబ్బే అని చెప్పొచ్చు. నియోజకవర్గంలో మదన్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో గులాబీ పార్టీకి ఎదురుదెబ్బే అని మండల ప్రజలు భావిస్తున్నారు. చిలిపిచేడు మండలంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు జరుగుతాయని మండల వైస్ ఎంపీపీ విశ్వంర స్వామి తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-నిజాంపేట

బీఆర్ఎస్‌పై అసంతృప్తితో, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 6 గ్యారంటీలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రావిపల్లి అమర సేనా రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక కొంతమంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించారన్నారు. మెదక్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటామన్నారు. ఎంపీపీ దేశెట్టి సిద్దరాములు, తిప్పనగుళ్ళ బి ఆర్ ఎస్ అధ్యక్షులు సూర రాములు, మంగిలి పల్లి యాదగిరి, రాజక్ పల్లి నాగరాజ్, చల్మెడ సర్పంచ్ నరసింహారెడ్డి, కల్వకుంట మాజీ సర్పంచ్ బురాని రాములు, కల్వకుంట మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ అబ్బా రెడ్డి, నందిగామ ఎంపీటీసీ సురేష్, నర్లాపూర్ వార్డ్ మెంబర్ మధు సూధన్, మాజీ ఉప్ప సర్పంచ్ గాలం బాలయ్య, బేజమైన భాస్కర్, బెజమైన సత్తయ్య, కమ్మరి బ్రహ్మ చారి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బద్రు శోభారాణి చెక్రధర్ రెడ్డి, వెంకటాపూర్ మధు సూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఒకరికి బదులు మరొకరు రాసిన పరీక్ష

నవ తెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలోని పారుపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షను ఒకరీ బదులు మరొకరు పరీక్ష రాయగా, అధికారులు అతనిని గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. డీఈవో శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రవీందర్ అనే వ్యక్తి కాకుండా, అతని పేరుమీద వేరే వ్యక్తి పరీక్ష రాసినట్లు తెలిపారు. అధికారులు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలవాల్సి ఉందని తెలిపారు.

ఆధారాలు లేని డబ్బులు సీజ్



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని మర్కుక్ గంగాపూర్-యూసుఫ ఖాన్ పల్లి చౌరస్తాలో మర్కుక్ ఎస్ఐ చల్ల మధుకర్ రెడ్డి అద్వర్యంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులకు ఎటువంటి ఆధారాలు లేకుండా ఒక కారులో తరలిస్తున్న రూ. 60 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు జిల్లాలోని పలు ప్రాంతాలలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డబ్బు, మద్యం, మాదక ద్రవ్యాల రవాణాపై గట్టి నిఘా వేశారు. శుక్రవారం మర్కుక్ నుండి శివారు వెంకటాపూర్ వైపు వెళుతున్న ఒక కారులో రూ.60 వేల నగదు పట్టుకున్నారు. ఈ డబ్బులు తీసుకెళుతున్న కానమైన రాజు ఎటువంటి పత్రాలు చూపకపోవడంతో పోలీసులు నగదును సీజ్ చేశారు. 50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకొని వెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. పై సీజ్ చేసిన డబ్బులను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్ కమిటీకి అప్పగించడం జరుగుతుందన్నారు. అక్కడ డబ్బులకు సంబంధించిన ఆధారాలు చూపించుకుని డబ్బులు రిలీజ్ చేసుకోవచ్చని సూచించారు. కేసు నమోదు చేసి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మదుకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్ టేబుల్స్ మల్లేశం, వేణు,తదితరులున్నారు.



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం కేంద్రంలో ఎస్సై తాండ్ర వివేక్, బార్డర్ చెక్పోస్ట్ స్టాటికల్ సర్వేలెన్సు టీమ్స్ ఎన్నికల నియమాల్లో భాగంగా శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులు వారి వాహనాలలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ: 2.23 లక్షలు తీసుకొని వెళ్తుండగా పట్టుకున్నారు. అనంతరం ఎస్ఐ వివేక్ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. కాబట్టి ప్రజలు రూ:50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకొని వెళ్తే మాత్రం ఆ డబ్బుకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలని తెలియజేశారు. ఎలాంటి ఆధారాలు లేకుంటే డబ్బు స్వాధీనం చేసుకొని, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్ సెల్ లో డబ్బులు డిపాజిట్ చేయడం జరుగుతుందన్నారు. సంబంధిత బాధితులు సరియైన ఆధారాలు తీసుకొని వెళ్లి డబ్బులు రిలీజ్ చేసుకోవాలని సూచించారు.



నవతెలంగాణ-చేర్యాల

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో చేర్యాల సీఐ ఎల్. శ్రీను, ఎస్ఐ దామోదర్ పోలీస్ సిబ్బందితో కలసి శుక్రవారం చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్త్యాల %శ% రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా సిద్దిపేట పట్టణానికి చెందిన గట్టు విజయ్ తన వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.1,21,200 లు తీసుకొని వెళ్తుండగా సీజ్ చేసినట్లు సీఐ ఎల్. శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు లోక్ సభ ఎన్నికల సందర్భంగా వాహనాల తనిఖీ నిర్వహించడం జరుగుతుందని,రూ. 50 వేల కంటే ఎక్కువ తీసుకొని వెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.సీజ్ చేసిన రూపాయలను కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్ సెల్ లో డిపాజిట్ చేయడం జరుగుతుందన్నారు.సంబంధిత బాధితులు సరియైన ఆధారాలు తీసుకొని వెళ్లి డబ్బులు రిలీజ్ చేసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ
సిద్దిపేట
శనివారం | 27 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

సిద్దిపేట డిపిఓ దేవకీదేవి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



గ్రామాలలో మంచినీటి సమస్య లేకుండా చూడాలని సిద్దిపేట డిపిఓ దేవకి దేవి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ సమీకృత డివిజనల్ కార్యాలయంలో అక్కన్నపేట పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ తాగునీటిపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు నీడ, నీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ , ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలో భవనల అనుమతులపై పంచాయతీ కార్యదర్శులను అవగాహన కల్పించారు. పతి గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, అక్కన్నపేట ఎంపీడీవో బి జయరాం, పంచాయతి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో.. అంబలి పంపిణీ



నవ తెలంగాణ- గజ్వేల్ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జగ్గయ్య గారి శ్రీనివాస్ సౌజన్యంతో దివంగత భూమయ్య జ్ఞాపకార్థం శుక్రవారం నిర్వహించిన అంబలి పంపిణీ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ అధ్యక్షులు జగ్గయ్య గారి శేఖర్, ప్రధాన కార్యదర్శి సిద్ధి నవీన్ కోశాధికారి వెంకటేష్, కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ధి బిక్షపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, ఎస్ సీ సంతోష్, అయ్యప్ప దేవాలయం అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని అన్నారు. అంబలి ఆరోగ్యానికి చాలా మంచిదని నిర్వాహకులను అభినందించారు. అలాగే పార్టీలకి అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా ఆర్యవైశ్యులు నిలుస్తున్నారని తెలిపారు. పీసీసీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి, గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహన్న గారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, రాజశేఖర రెడ్డి, గజ్వేల్ గౌడ సంఘం అధ్యక్షులు రాజా గౌడ్, ఆర్యవైశ్య నాయకులు భద్రయ్య, తోట బిక్షపతి, కైలాస ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో పిల్లలతో జాగ్రత్త

సీపీ. డాక్టర్ బి.అనురాధ

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్



వేసవి సెలవుల్లో పిల్లల భద్రత పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త ఉండాలని సీపీ. డాక్టర్ బి.అనురాధ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని ,భవిష్యత్తు భారతావనికి వారె పునాదులని, వారిని కంటికి రెప్పలాగా కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి సంవత్సరం వేసవి సెలవులలో ఎంతో మంది అమాయక విద్యార్థులు ఆకారణంగా ప్రాణాలు పోగొట్టుకొని కన్న వారికీ కడుపుకోత మిగిలిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసారు. తల్లితండ్రులకు చెప్పకుండా ఎక్కడికి పోరాదని పిల్లలకు చెప్పాలని, మిత్రులతో కలిసి ఆడుకుంటూ అటునుంచి అటే చెరువు వద్దకు, కుంటల వద్దకు పోయి ఈత రాకుండానే ఉత్సాహంతో వాటిలో దిగి ప్రమాదాల్లో పడకుండా చూసుకోవాలని అన్నారు.

వేసవి కాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

నవ తెలంగాణ-కొండపాక



వేసవి కాలంలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ సీనియర్ హెూమియోపతి వైద్యుడు వల్లకోటి దేవేందర్ అన్నారు. కొండపాక లోని ఆనంద నిలయంలో వృద్ధులకు ఉచితంగా వడదెబ్బ నివారణ కొరకు ముందస్తు హెూమియోపతి మందులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవేందర్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి పలు వృద్ధ, అనాధ పిల్లల ఆశ్రమల్లో ఉచితంగా మందుల పంపిణీ చేస్తున్నా మన్నారు. ఎండ తీవ్రత బాగా వున్నప్పుడు అవసరం ఉంటే తప్ప బయటకు రావాలన్నారు. నీటిని, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఇంచార్జి అరుణ ప్రతాప్ రెడ్డి, గట్టు అమర్నాథ్, వడ్డేపల్లి సుధాకర్, పెరాల రాజులు పాల్గొన్నారు.

మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్‌గా తిరుపతి

నవతెలంగాణ-తొగుట



తనపై నమ్మకంతో మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్‌గా బాధ్యతను అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి, మెట్టు సాయి కుమార్‌కు టీపిసిసి ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో అధిక స్థానాలు గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతుందన్నారు. ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని లద్నూర్, గ్రామంలో జరు గుతున్న బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమానికి మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా దూళ్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామంలో జరుగుతున్న దుర్గమ్మ పండుగకు హాజరై దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపిటిసి గుజ్జుక సమ్మయ్య, నందన బోయిన నర్సింలు, నాయకులు పుట్ట వెంకటరమణ రెడ్డి, చల్ల మహేందర్ రెడ్డి, బాల్ నరసయ్య పాకాల కిరణ్ కుమార్ పాల్గొన్నారు


ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ కాంగ్రెస్‌లో చేరిక

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్



ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ సిద్ధర బోయిన శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఎన్ ఎస్ యు ఐలో రాష్ట్ర కమిటీలో బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్ ఆ తర్వాత తెలంగాణ ఉద్యమ సమయంలో బిఆర్ఎస్ లో చేరారు. మిట్టపల్లి గ్రామ సర్పంచ్ గా, పిఎసిఎస్ చైర్మన్ గా, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్ ప్రస్తుతం బిఆర్ఎస్‌లో ఉంటూ ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సొంత గూటికి రావడం ఆనందంగా ఉందన్నారు.

ఆలయాలకు శంకుస్థాపన



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని జాలపల్లి గ్రామంలో మురళి కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో చౌడలమ్మా మల్లన్నస్వామీ దేవాలయాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచ్లు, అన్ని కుల సంఘాల పెద్దమనుషులు గ్రామస్తులు, గ్రామపెద్దలు యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

ఆత్మగౌరవ ప్రతీకలో సిద్దిపేట కవుల కవితలు

నవ తెలంగాణ-సిద్దిపేట



సమ్మక్క, సారలమ్మ జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర. అట్టి జాతరపై బండి ఉష సంపాదకత్వంలో 535 మంది కవుల, కవయిత్రుల విరచిత కవిత, గేయ, పద్య మహాసంకలనం శ్రీ సమ్మక్క సారలమ్మల వైశిష్ట్యం, మేడారం జాతరపై ఆత్మగౌరవ ప్రతీక పుస్తకాన్ని తీసుకురావడం జరిగింది. ఇందులో సిద్దిపేట జిల్లా నుండి 15 మంది కవులు తమ కవితలను పంపగా పుస్తకములో ముద్రింపబడినాయి. శుక్రవారం కవులు విక్టరీ టాకీస్ వద్ద గల మహాత్మా గాంధీ చిల్డ్రన్ పార్కులో పుస్తకాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కవులు కొమురవెల్లి అంజయ్య, వర్కోలు లక్ష్మయ్య, డా.బి.సుధాకర్, మచ్చ అనురాధ, ఎడ్ల లక్ష్మి, బస్వ రాజ్ కుమార్, ఎడ్ల భూంరెడ్డి, గజెల్లి సత్యనారాయణ, కవులు పాల్గొన్నారు.

త్రిబుల్ ఇంజన్ సర్కారులో భాగస్వాములవ్వాలి

ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి విజ్ఞప్తి
బీజేపీ,బీఆర్ఎస్ అబద్దాల కోరులంటూ ఆరోపణ
మాటిస్తే మడమ తిప్పని పార్టీ కాంగ్రెస్ హామీ
ఇథనాల్ పరిశ్రమ పాపం బీఆర్ఎస్ పార్టీదేనని స్పష్టం

నవతెలంగాణ-బెజ్జంకి



అవినీతితో పరిపాలన సాగించిన డబుల్ ఇంజన్ సర్కారులకు తగిన బుద్ధి చెప్పేల త్రిబుల్ ఇంజన్ కాంగ్రెస్ సర్కారులో ప్రజలు భాగస్వాములవ్వాలని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్,మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బస్టాండ్ వరకు వెలిచాల రాజేందర్ రావు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడారు. ప్రపంచంలో భారత దేశాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామంటూ బీజేపీ.. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకవుతామని బీఆర్ఎస్ పార్టీల ఎంపీ అభ్యర్థులు అబద్దాలు చెబుతూ మరోసారి ప్రజలు మోసం చేస్తున్నారని ప్రజలు అలోచన చేయాలని సూచించారు. మాటిస్తే..మడమ తిప్పని పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని ఎన్నికల అనంతరం ఆరు గ్యారెంటీలు, ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. పూర్వపు కరీంనగర్ జిల్లాను బీఆర్ఎస్ నేతలు తమకూలంగా ఏడు ముక్కలుగా విడదీసి బెజ్జంకి మండలాన్ని సిద్దిపేట జిల్లాలో కలిపింది బోయినిపల్లి వినోద్ కుమారేనని అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే హరీశ్ రావువన్ని అబద్దాల కోరూ మాటలనని మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి అలయ అభివృద్ధికి రూ.15 కోట్లు మంజారీ చేస్తామని హామీ ఇచ్చి నిధులివ్వకుండా శఠగోపం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాలకు అనుకూలంగా వ్యవహరించింది బీఆర్ఎస్ ప్రభుత్వపాపమేనని స్పష్టం చేశారు.మండలాన్ని యథావిధిగా కరీంనగర్ జిల్లాలో కలుతామని.. రాష్ట్రంలోని మంత్రులు,నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలకు తోడుగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించి త్రిబుల్ ఇంజన్ సర్కారులో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీగా వల్ల రాజేందర్ రావును గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

బీజేపీకి అధికారమిస్తే రాజ్యాంగ మార్పు తథ్యం

సర్వమతాలకు నిలయమైన భారత దేశంలో మతోన్మాద చిచ్చుపెడుతూ రాముడితో ప్రజల మధ్య వైరాష్యాలు సృష్టించి అధికారం చేపట్టాలని బీజేపీ యత్నిస్తోందని..మళ్లీ బీజేపీ అభ్యర్థులకు ఓటేసి గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చడం తథ్యమని కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. దేశానికి బీజేపీ,కరీంనగర్ బండి సంజయ్ చేసిందేమిలేదని..స్థానికేతరుడు బోయినిపల్లి వినోద్ కుమార్ ప్రజలకు చేసిందేమిలేదని అవినీతి, అబద్దాలతో ప్రజలను మోసం చేసే బీజేపీ,బీఆర్ఎస్ అభ్యర్థులకు తగిన గుణపాఠం చెప్పేల కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని రాజేందర్ రావు ప్రజలను అభ్యర్థించారు. నాయకులు రత్నాకర్ రెడ్డి,ఒగ్గు దామోదర్,పులి క్రిష్ణ,మహిళాధ్యక్షురాలు కనగండ్ల జ్యోతి,అయా గ్రామాల నాయకులు,కార్యకర్తలు, మహిళలు హజరయ్యారు.

బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ వ్యాపార కంపెనీలు

డీఎస్పీ మెదక్ ఎంపీ అభ్యర్థి అన్నెల లక్ష్మణ్

నవ తెలంగాణ -దుబ్బాక



బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్.. రాజకీయ వ్యాపార కంపెనీలు.. ప్రజాసేవ పేరిట దోచుకోవడమే వాటి అసలు నైజం. భూమి, సంపద, రాజ్యాధికారం కేవలం 10 శాతం ఉన్న అగ్రకులాల చేతుల్లోనే ఉంది. 90 శాతం జనాభా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు రాజకీయంగా చైతన్యం కావాలి. దేశ సంపదలో ప్రతి ఒక్కరికి సమాన వాటా, గౌరవం దక్కాలి" అని ధర్మ సమాజ్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి అన్నెల లక్ష్మణ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని చేర్వాపూర్ వార్డులో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం దుబ్బాకలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగాన్ని పదేపదే మారుస్తామంటున్న బీజేపీకి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసి అప్పుల్లో నింపిన బీఆర్ఎస్‌కు, ఆచరణకు సాధ్యం కాని 420 హామీలతో ప్రజల్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీలకు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విద్యా వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు వంటి కనీస మౌలిక సదుపాయాల్ని కల్పించకుండా అక్కరకు రాని ఉచిత పథకాలతో ప్రజల్ని ఆ పార్టీల వైపు తిప్పుకుంటున్నాయని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బిడ్డలను బలిపీఠం ఎక్కించి అధికారాన్ని మాత్రం అగ్రకుల నాయకులు అనుభవించారని తెలిపారు. 70 ఏండ్ల పాటు కాంగ్రెస్ దేశాన్ని పీల్చిపిప్పి చేస్తే, పదేండ్ల పాటు బీజేపీ మతం పేరిట దేశంలో విద్వేషాలను రగిలిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లలో దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై అనేక రకాల దాడులు జరిగాయని అన్నారు. దేశంలో పుట్టిన ప్రతి మనిషికి సమాన వాటా, సమాన గౌరవం దక్కేలా, బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు, 33 శాతం మహిళా బిల్లు ఆమోదం కోసం పార్లమెంట్‌లో ధర్మ సమాజ్ పార్టీ కొట్లాడుతుందని స్పష్టం చేశారు. దేశంలో అశోక ధర్మ రాజ్య స్థాపన నిర్మాణమే లక్ష్యంగా ధర్మ సమాజ్ పార్టీ తెలంగాణలో 15 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. చెప్పుల గుర్తుకు ఓటేసి ధర్మ సమాజ్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డీఎస్పీ రాష్ట్ర నాయకులు మంద జ్యోతి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి వేముల వెంకట ప్రసన్న, జిల్లా జనరల్ సెక్రటరీ కాసర్ల యాదగిరి, దుబ్బాక జనరల్ సెక్రటరీ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫెడ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

నిర్మాణ పనులు పరిశీలించిన హార్టికల్చర్ డైరెక్టర్ అశోక్

నవతెలంగాణ -నంగునూరు



ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని హార్టికల్చర్ డైరెక్టర్ అశోక్ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలో జరుగుతున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ.. నర్మెట గ్రామంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు చురుగ్గా జరుగుతున్నాయని చెప్పారు. రైతులెవరూ అధైర్యపడొద్దని, ఫ్యాక్టరీ పనులు ఎనిమిది, పది నెలల్లో పూర్తవుతుందని తెలిపారు. అధిక దిగుబడులు, నిరంతరాయంగా ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలని సూచించారు. వేసవిలో ఆయిల్ పామ్ మొక్కల చుట్టూ జీలుగా, జనుము విత్తనాలను వేసుకోవాలని సూచించారు. వేసవిలో ఇలా మొక్క చుట్టూ జనుము నాటడం వల్ల గాలిలో తేమశాతం పెరిగి మొక్క పెరుగుదలకు దోహదపడి మైక్రో వాతావరణం వృద్ధి చెందుతుందని అన్నారు. తొలకరి వర్షాకాలం వరకు జనుము ఎదుగుదలని కొనసాగించి పూత రాకముందే గెల చిన్న ముక్కలుగా కత్తిరించి పాదులో వేయడంవల్ల కలుపును నివారించడమే కాకుండా సేంద్రీయ ఎరువుగా మార్పు జరిగి తేమను నిలువరింపు చేస్తోందని అన్నారు. అలాగే మొక్కలకు డ్రిప్ ద్వారా 2నుంచి 3గంటలు నీటిని ఉదయం, సాయంత్రం వేళల్లో ఇవ్వాలని చెప్పారు. పూల గుత్తిలను ఎప్పటికప్పుడు తీసివేయాలని, ఇలా 30 నెలల వరకు కొనసాగించాలని తెలిపారు. నంగునూరు మండలంలో ఇంకో రెండు, మూడు నెలల్లో ఆయిల్ పామ్ గెలల కోత ప్రారంభమవుతుందని చెప్పారు. గెలలు కొనడం కూడా మొదలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, ఆయిల్ ఫెడ్ డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి శంకర్, హార్టికల్చర్ అధికారి బాలాజీ, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, పాలమాకుల సొసైటీ చైర్మెన్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేసిన తర్వాతనే ఓట్లు అడగాలి

కష్టజీవుల పార్టీ సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసిన తర్వాతే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేర్యాల ప్రాంతంలో ఓట్లు అడగాలని సీపీఐ(ఎం) చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబడి నాగరాజు అన్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల కోసం పనిచేస్తూ కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం అనేక ప్రభుత్వ నిర్బంధాలను ఎదిరించి ఉద్యమిస్తున్న సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండీ జహంగీర్ సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. శుక్రవారం చేర్యాల పట్టణంలోని 7,8 వార్డుల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంతం వెనుకబడటానికి ప్రధాన కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల అభ్యర్థులు.. తమ అభ్యర్థులను గెలిపిస్తే నెల రోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామని ప్రచారం చేశారన్నారు. కానీ నాలుగు నెలలు గడిచినప్పటికీ చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడంలో రెండు పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య చిచ్చు పెడుతూ మతతత్వాన్ని, దేశంలో నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తుందన్నారు. అదానీ, అంబానీ లాంటి వారికే దేశ సంపదను దోచిపెడుతుందని విమర్శించారు. దేశంలో వామపక్షాల బలం పెరిగితేనే పార్లమెంటులో పేద ప్రజల వాణి వినిపించగలుగుతారని, అందుకు జహంగీర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, పి. సుధాకర్, నవీన, చేర్యాల పట్టణ కమిటీ సభ్యులు పోలోజు శ్రీహరి, బండ కింది అరుణ్ కుమార్, ఇప్పకాయల శోభ, ముస్త్యాల ప్రభాకర్, రాళ్ల బండి భాస్కర్, బోయిని మల్లేశం, రాళ్ల బండి చందు, ఆముదాల రంజిత్ రెడ్డి, ఎండీ నూర్బీ, మేర్గోజు ప్రవీణ్ కుమార్, బొంగోని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హ్యాండ్ బాల్ కోచింగ్ క్యాంపు

హ్యాండ్ బాల్ సమ్మర్ కోచింగ్ ఇన్‌చార్జి కోచ్ దామెర మల్లేశం

నవతెలంగాణ-మద్దూరు



మద్దూరు మండల కేంద్రంలో మే 1 నుండి 31 వరకు సిద్దిపేట జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, సిద్దిపేట జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఉచిత హ్యాండ్ బాల్ కోచింగ్ వేసవి క్యాంపును జడ్పీహెచ్‌సీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు హ్యాండ్ బాల్ సమ్మర్ కోచింగ్ ఇన్‌చార్జి కోచ్ దామెర మల్లేశం శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్దూరు మండల కేంద్రంలో నిర్వహించే ఉచిత హ్యాండ్ బాల్ కోచింగ్ క్యాంపు క్రీడాకారులకు హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మెన్ బడిగం శ్రీనివాస్ గౌడ్, తన తల్లి బోడిగం రాజమ్మ జ్ఞాపకార్థం 100 మంది క్రీడాకారులకు దుస్తులను అందజేస్తున్నట్టు చెప్పారు. హ్యాండ్ బాల్ క్రీడల్లో రాణించిన ఎంతోమంది యువతీ యువకులు ఆర్మీ, నేవీ, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, పోలీస్ శాఖల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. 15 సంవత్సరాల లోపు యువతీయువకులు ప్రతి ఒక్కరూ ఉచిత హ్యాండ్ బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మద్దూర్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు బోయిని మనోహర్, మహమ్మద్ ఇంతియాజ్, కమిటీ సభ్యులు బూరుగు నరసింహులు, పీడీ దామెర ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్టు బీజేపీని ఓడించండి

సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

నవ తెలంగాణ - సిద్దిపేట



ఫాసిస్టు బీజేపీని ఓడించి దేశంలో రాజ్యాంగాన్ని కాపాడాలని సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి చింత భూమేశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ దేశంలో ప్రజల మధ్య విభజన రేఖలు గీసి, ఫాసిస్టు పాలనను పదేండ్లుగా కొనసాగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో అనేక అల్లర్లకు, మత గొడవలకు కారణం అయ్యిందని, ప్రజాస్వామ్య, లౌకిక విలువలను పాతరేసి ఫక్తు మతోన్మాద విధానాలను అవలంబించిందని ఆరోపించారు. దేశభక్తి ముసుగులో నోట్ల రద్దు చేసి, సీఏఏ, ఎన్ఆర్సీ, రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు, కోడ్స్, నూతన జాతీయ విద్యా విధానం, ఆర్టికల్ 370 రద్దు లాంటి చట్టాలు చేసిందని తెలిపారు. హిజాబ్ లాంటి మత విద్వేష రాజకీయాలకు తెరలేపిన బీజేపీని పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించాలని అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా మే 1 నుంచి 13 వరకు మెదక్ పార్లమెంట్ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారాలు నిర్వహించనున్నట్టు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉద్యమకారులు సత్తయ్య, డీపీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ శ్రీకాంత్, విశ్రాంత ఉపాధ్యాయులు జాన్ వెస్లీ, డీఎస్ఎస్ జిల్లా నాయకులు రఫిక్, సీసీసీ నాయకులు శ్వేతా, సుజాత, ఐఎఫ్టీయూ నాయకులు ఆకుల రాములు, డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే సీపీఐ(ఎం) ఎజెండా

పార్టీ భువనగిరి అభ్యర్థి ఎండీ జాంగిర్ గెలిపించాలి
సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సత్తిరెడ్డి

నవతెలంగాణ - కొమురవెల్లి



ప్రజా సమస్యలే ఏజెండాగా పోరాటాలు నిర్వహించే సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మండలంలోని అయినాపూర్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి కూలీలను సీపీఐ(ఎం) అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికలప్పుడు డబ్బు, మద్యం పంచుతూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తారని, ప్రజలు అప్రమత్తతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఎన్నికలప్పుడు అనేక హామీలు ఇస్తూ గద్దెనెక్కిన ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని, వాటిని పార్లమెంటులో నిలదీసే భువనగిరి ఎంపీ అభ్యర్థి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి ఎండీ జహంగీర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు తాడూరి రవీందర్, తేలు ఇస్తారి, సున్నం యాదగిరి, పాశం చంద్రయ్య, పోచవ్వ, హనుమంతు, కళా, కనకవ్వ, మనేవ్వ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం



నవతెలంగాణ-మర్కుక్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు భారీ మోజారిటీతో విజయం సాధిస్తారని ఆ పార్టీ మండల సీనియర్ నాయకులు అన్నారం బాపురెడ్డి, కామిడీ సాయికుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్కుక్‌లో వారు మాట్లాడుతూ.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని, మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరని తెలిపారు. బీజేపీకి క్యాడర్ లేదని, ఈ ఎంపీ ఎన్నికల్లో మెదక్ ఎంపీగా పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి విజయం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ మట్టికరిపించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

ఆయాలు లేక అంగన్వాడీ టీచర్లు అవస్థలు

నవతెలంగాణ-వర్గల్ : మండలంలోని అంబర్‌పేట గ్రామ అంగన్వాడీ కేంద్రంలో ఆయా లేకపోవడం వలన వంట చేయటం, ఆయా చేయాల్సిన అన్ని పనులు టీచర్ చేసుకోవడం వలన అవస్థలు పడుతున్నారని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. శుక్రవారం రోజున అంబర్ పేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆయాలను నియమించాలని ప్రభుత్వన్నీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రాజెక్టు పరిధిలో 16 ఉపాధ్యాయ, 43 సహాయక పొస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీచేసి అంగన్వాడీ కేంద్రాలు సజావుగా సాగేవిధంగా సహకరించాలన్నారు. చాలా కేంద్రాలు, అద్దె భవనాలలో కొనసాగుతున్నాయన్నారు. అద్దె భవనాలకు వాటర్ లేక మరుగుదొడ్లు లేనందున చాలా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉన్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కొరారు.



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణంతోపాటు చేర్యాల మండలంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి జనగామ డిసిసి అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సమక్షంలో శుక్రవారం ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న పథకాలు, సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అందించే ప్రతి పథకాన్ని అర్హులైన పేదలందరికీ అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన తప్పులు కాంగ్రెస్ పార్టీ చేయకుండా ప్రజలకు సేవ చేస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో చేర్యాల పట్టణానికి చెందిన ముస్త్యాల కిష్టయ్య, కందుకూరి ఉపేందర్, అడ్వకేట్ భూమిగారి మనోహర్, తాటికొండ సదానందం, మల్లిగారి సూరయ్య, బండ అశోక్, ముస్త్యాల కిషోర్, గణపురం బాలస్వామి, గణపురం కళాధర్, కాశేగుడిసెలు తాజా మాజీ సర్పంచ్ సమీర్, షేక్ బాబా, పోరండ్ల వెంకటేశ్వర్లు, బండి శీను, మద్రిముస్త్యాల కు చెందిన బొడిగం చంద్రారెడ్డి పార్టీలో చేరారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT AND SESSIONS JUDGE AT SIDDIPET
G.W.O.P.NO. 8 OF 2024

Between:
Knathala Amarender Reddy
In the matter of Kanthala Advik Reddy Minor ...Petitioner
//And//
To whomsoever it may concern .....Respondents

Whereas the Petitioner has filed a Petition for Sale of minor i.e., Kanthala Advik Reddy **to an extent 208 Sq. Yards in Sy.No.615 it's Plot Nos.30 & 31 Situated at Husnabad Town & Mandal of Siddipet District** against to whom-so ever it may concern,

Take notice that the said petition is posted on **05-06-2024** for the appearance of any interested persons at 10.30 AM before the Hon'ble Court in Person or through advocate failing which the matter will be decided and determined in your absence.

//BY THE ORDER OF THE HON'BLE COURT//

Sd/-
CH. HANUMAIAH
V. NAGAPOOJA
Advocates
Husnabad/ Siddipet
Cell : 9440551000